సాక్షి అనంతపురం

సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



కమలపాడులో దొంగల బీభత్సం

వజ్రకరూరు మండలంలోని కమలపాడులో ఆదివారం దొంగలు బీభత్సం సృష్టించారు. మాజీ ఎంపీపీ ఇంట్లో ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు అపహరించారు. 8లో



రైతు కష్టం.. దళారుల పాలు

రైతు కష్టం దళారుల పాలవుతోంది. మార్కెట్లలో నిలువుదోపిడీ చేస్తున్నారు. దీంతో దిగుబడిని మార్కెట్‌లోనే రైతులు వదిలేసి వస్తున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.2°/21.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో పరిష్కార వేదిక



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు.

సీఎం కాన్ఫరెన్స్‌కు వెళ్లిన కలెక్టర్




కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం బయలుదేరి వెళ్లారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి శాఖల వారీగా నివేదికలను తీసుకెళ్లారు. కాన్ఫరెన్స్‌లో వాటిని సమర్పిస్తారని అధికారులు తెలిపారు. కలెక్టర్ తిరిగి ఈనెల 17వ తేదీన విధులకు హాజరవుతారని కలెక్టరేట్ అధికార వర్గాలు వెల్లడించాయి.

సిలిండర్‌తో మోది వ్యక్తి హత్య

అనంతపురం: నగరంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్ల గ్రామానికి చెందిన తలారి చిన్న పెద్దన్న (51) బ్రాయిలర్ కోళ్లను రవాణా చేసే వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో అనంతపురంలోని పాతూరు రాణినగర్‌కు చెందిన అంజినమ్మతో వివాహేతర సంబంధం ఏర్పడింది. మూడేళ్లుగా అంజినమ్మ ఇంటికి రాకపోకలు సాగాయి. ఈ క్రమంలోనే శనివారం రాత్రి అంజినమ్మ ఇంటికి వెళ్లాడు. ఖాళీ గ్యాస్ సిలిండర్‌తో తలపై గట్టిగా బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం చిన్న పెద్దన్న కుమారుడికి అంజినమ్మ ఫోన్ చేసి 'మీ నాన్నను ఎవరో చంపేసి వెళ్లిపోయారు' అని చెప్పి ఫోన్ కట్ చేసింది. అప్పటి నుంచి అంజినమ్మ, ఆమె కుమారుడి ఫోన్ పనిచేయలేదు. దీంతో చిన్న పెద్దన్న కుమారుడు గోపాల్, బంధువులు అంజినమ్మ ఇంటికి చేరుకుని పరిశీలించారు. శనివారం రాత్రి అంజినమ్మతో గొడవ జరుగుతుండగా ఆమె కుమారుడు రమేష్ జోక్యం చేసుకున్నట్లుగా తెలుసుకున్నారు. అదే సమయంలో కుమారుడు రమేష్‌తో కలసి గ్యాస్ సిలిండర్‌తో పెద్దన్నపై దాడి చేసి హతమార్చినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, స్నిప్పర్ డాగ్‌ను రంగంలోకి దింపి ప్రాథమిక ఆధారాలు సేకరించారు. హతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు టీకాలు



అనంతపురం అగ్రికల్చర్: నెల రోజుల పాటు సాగనున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సోమవారం ప్రారంభమవుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ టీవీ సుధాకర్, స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.రవిబాబు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు నెలలు దాటిన అన్ని పశువులు, గేదెలు, ఎద్దులకు ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. ఇప్పటికే అన్ని పశువుల ఆస్పత్రులకు 6.20 లక్షల మందు డోసులు సరఫరా చేశామన్నారు. అక్టోబర్ 15 లోపు ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల్లో తీవ్ర జ్వరం, కాలి గిట్టలు, నోట్లో పుండ్లు, పగుళ్లు, బాగా నీరసించడం, పాల దిగుబడి, పని సామర్థ్యం బాగా తగ్గి చివరకు ప్రాణనష్టం కూడా సంభవిస్తుందన్నారు. ఆర్థికంగా నష్టం కలగజేసే ఈ వ్యాధి నివారణకు ఏటా రెండు సార్లు ఉచితంగా టీకాలు వేస్తారని తెలిపారు. టీకాలు వేసిన ప్రతి పశువుకూ చెవిపోగు వేసి ట్యాగ్‌రూపంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పశుశాఖ అధికారులు, క్షేత్రస్థాయిలో ఉన్న పారాస్టాఫ్‌ను సంప్రదించి తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు.

అక్షరమే ఆయుధం

ప్రశ్నించే గొంతుకపై కక్ష సాధింపు



అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఒక నాయకుడు ప్రెస్‌మీట్‌లో చెప్పిన అంశాలను ప్రచురిస్తే మీడియాపై కేసులు పెట్టడం మంచి పద్ధతి కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛపై గౌరవభావం కలిగి ఉండాలి. భయపెట్టి నిజాలను కప్పివేయాలనుకోవడం సరికాదు. 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి, ఇతర పాత్రికేయులపై పెట్టిన కేసులను కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి.

– వైటీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మడకశిర

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తారా?



పత్రికా స్వేచ్ఛకు, వాక్‌స్వాతంత్ర్యపు హక్కుకు సంకెళ్లు వేస్తారా? కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే దురుద్దేశంతోనే ఇలాంటి నీచ రాజకీయాలకు తెరలేపుతోంది. స్టేట్‌మెంట్ ప్రచురించిన పత్రికపై కేసులు పెట్టడం దారుణం. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు. ప్రభుత్వానికి,ప్రజలకు మధ్య వారధి మీడియా. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపి, వారి బాధ్యతను గుర్తు చేసి ప్రజలపక్షాన నిలిచి పోరాడేది మీడియా. అలాంటి మీడియా స్వేచ్ఛను అణచివేయడానికి అక్రమ కేసులు పెట్టడం అన్యాయం. ప్రతిఒక్కరూ ఖండించాలి.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ధర్మవరం

పచ్చదనం బొగ్గుపాలు



శెట్టూరు మండలం బసాపురం సమీపంలో వెలసిన బొగ్గుల బట్టీ

- యథేచ్ఛగా బొగ్గు బట్టీల ఏర్పాటు
- అధికార పార్టీ నేతల అండతో దోపిడీ
- పర్మిట్ల ముసుగులో అక్రమాలు
- 'మామూలు'గా పోతున్న అటవీశాఖ అధికారులు

రాయదుర్గం/కుందుర్పి: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు రూ. కోట్లు వెచ్చిస్తుంటే... కొందరు స్వార్థపరులు ఆ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. అటవీ శాఖ అనుమతులు లేకుండా బొగ్గుబట్టీలు నిర్వహిస్తూ పచ్చదనాన్ని 'బొగ్గు'పాలు చేస్తున్నారు. పెద్ద పెద్ద చెట్లను నేలకూలుస్తున్నారు. విలువైన కలపను బొగ్గుగా మార్చి రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొందరు యథేచ్ఛగా బొగ్గు బట్టీలు నిర్వహిస్తున్నా అటవీశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకుల అండతోనే బొగ్గుల బట్టీల నిర్వాహకులు దోపిడీ చేస్తున్నారని, అందుకే అటవీ శాఖ అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు పాతర..

జిల్లాలో కళ్యాణదుర్గం, గుత్తి, అనంతపురం ఫారెస్ట్ రేంజ్‌లు ఉన్నాయి. గతంలో మూడు రేంజ్‌ల పరిధిలో అధికారికంగా నూతిమడుగు, సంతేకొండాపురం, వేపరాళ్ల, రచ్చుమర్రి, గార్లదిన్నె, సలకంచెరువు, పామిడి, చుక్కలూరు గ్రామాల్లో బొగ్గు బట్టీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. అయితే, వీటిలో కొన్నిచోట్ల గడువు ముగిసినా నేటికీ అలాగే కొనసాగిస్తున్నట్టు సమాచారం.కుందుర్పి, శెట్టూరు, గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, కణేకల్లు, రాయదుర్గం మండలాల్లో ఇష్టారాజ్యంగా బొగ్గు బట్టీలు వెలిశాయి. అటవీ శాఖ అనుమతులున్న చోట కూడా తుమ్మ చెట్లు, వాటి మొద్దులు మాత్రమే కాల్చి బొగ్గుగా మార్చాలి. అయితే నిబంధనలకు పాతరేస్తూ విలువైన కలపను తరలిస్తూ బొగ్గుగా మారుస్తుండడం గమనార్హం.



రాయదుర్గం సమీపంలో బొగ్గులను బస్తాల్లో నింపిన దృశ్యం



కళ్యాణదుర్గం సమీపంలోని కామక్కపల్లి అటవీ ప్రాంతం నుంచి రాత్రి సమయంలో కలపను తరలిస్తున్న దృశ్యం

పర్మిట్ల ముసుగులో దోపిడీ

ఒక్కో బొగ్గు బట్టీ డిపోకు పది పర్మిట్ల వరకు అటవీ శాఖ అధికారులు జారీ చేస్తారు. 30 కిలోల చొప్పున బొగ్గు బస్తాల్లో నింపి లారీలో 200 బస్తాల వరకు తరలించవచ్చు. ఈ లెక్కన పర్మిట్‌కు ఆరు టన్నుల చొప్పున తరలించే వెసులుబాటు ఉంటుంది. అయితే తక్కువ పర్మిట్లు పొంది ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేస్తున్నట్టు తెలిసింది. ప్రతి నెలా 400 టన్నులకు పైగా అక్రమంగా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నట్టు సమాచారం. టన్ను బొగ్గు రూ.20 వేల నుంచి రూ.25 వేల ప్రకారం విక్రయిస్తూ రూ.కోటికి పైగా కొల్లగొడుతున్నట్లు తెలిసింది.

అడవులను కాపాడాలి



బొగ్గుల బట్టీల మాటున పచ్చని చెట్లను నేలకూల్చుతున్నారు. చెరువుల్లో కంప చెట్లు అంటూనే అటవీ ప్రాంతాల్లోని కలపను సైతం తరలిస్తున్నారు. బొగ్గు బట్టీలకు అనుమతులు ఇవ్వకూడదు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంది.

– తిప్పేస్వామి, జంబుగుంపల, కుందుర్పి మండలం

కంపచెట్లు మాత్రమే వాడాలి



ఇటుకల, బొగ్గుల బట్టీలు నిర్వహించే వారు కేవలం చెరువులు, గుట్టల్లో ఉన్న కంప చెట్లను మాత్రమే వాడాలి. అటవీశాఖ వారు గ్రామాలకు దూరంగా బట్టీలు నిర్వహించేలా చూడాలి. కుందుర్పిలో అర కిలోమీటరు దూరంలోనే బట్టీలు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. –మంజు, కుందుర్పి గ్రామం

లైసెన్సులు రద్దు చేస్తాం

ఎక్కడైనా చెట్లను నరకాలంటే నీరు–నేల–చెట్టు చట్టం ప్రకారం అనుమతులు పొందాలి. అనుమతి లేకుండా నరికితే జైలు శిక్ష తప్పదు. అటవీశాఖ అనుమతులు లేకుండా ఎక్కడైనా బొగ్గు బట్టీలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బొగ్గు అమ్మకాలు జరపాలంటే అటవీ శాఖ అనుమతి తప్పనిసరి. ఏ చెట్టు నరికి బొగ్గుగా తయారు చేస్తున్నారనేది అనుమతి పత్రంలో చూపాలి. అనుమతి పొందిన బట్టీలపై కూడా ప్రత్యేక నిఘా ఉంచుతాం. తుమ్మ చెట్లు, వాటి మొద్దులు కాకుండా ఇతర ఏ కలప వినియోగించినా లైసెన్సులు రద్దు చేయిస్తాం.

– రామచంద్రుడు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కళ్యాణదుర్గం

ఆహారం.. ఘోరం

- జీజీహెచ్ 'డైట్'లో కొరవడిన నాణ్యత



నాణ్యత లేని ఉప్మాను చూపుతున్న మహిళ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు అందించే ఆహారంలో నాణ్యత లోపించింది. జీజీహెచ్‌లో డైట్ తయారు చేసే గది బూత్ బంగ్లాను తలపిస్తోంది. దీనిపై గతంలోనే 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమైనా పరిస్థితిలో మార్పురాలేదు. సర్వజనాస్పత్రిలో రోజూ 2,500 మంది ఓపీ, 1,100 మంది ఇన్‌పేషంట్లు ఉంటారు. ఇన్‌పేషంట్లలో గైనిక్, లేబర్ వార్డుల్లో జేఎస్ఎస్‌కే మెనూ ప్రకారం, మధుమేహం ఉన్న వారికి మరో రకమైన ఆహారం ఇవ్వాలి. కానీ నూతన కాంట్రాక్టర్ అలాంటి చర్యలు తీసుకోలేదు. ఆదివారం ఉదయం ఆస్పత్రిలో నాణ్యత లేని ఉప్మా, నీళ్ల చట్నీ, పాలు అందించారు. ఇడ్లీ, పొంగల్ ఇస్తారు కదా అని డైట్ అందించేవారిని అడిగితే ఇంట్లోలాగా ఇక్కడ భోజనం పెట్టరు.. ఏమి ఇస్తే అదే తీసుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. గైనిక్, లేబర్ వార్డులోని గర్భిణులు, బాలింతలకు కిచిడీ, చట్నీ ఇవ్వాల్సి ఉండగా, ఉప్మాతోనే సరిపెట్టారు. అలాగే మధ్యాహ్నం, రాత్రి వేళల్లోనూ మెనూ పాటించలేదని తెల్సింది.

శుభ్రత పాటించని డైట్ సిబ్బంది..

డైట్ సరఫరా చేసే సిబ్బంది శుభ్రత పాటించడం లేదు. చెప్పులు వేసుకొని ఆహారం తీసుకెళ్లే ట్రాలీని తోసుకెళ్తున్నారు. దీంతో పాటు చేతులకు గ్లౌజు, ముఖానికి మాస్క్, తలకు క్యాప్ లేకుండానే ఆహారం సరఫరా చేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తేనే పరిస్థితులు మెరుగుపడతాయని రోగులు అంటున్నారు.



సురక్షిత ప్రమాణాలు పాటించకుండానే ఆహారం సరఫరా చేస్తున్న దృశ్యం

నమ్మబలికి.. నిరాశ మిగిల్చి

- శింగనమల మండలం రాచేపల్లిలో ప్రారంభం కాని లెదర్ పార్క్
- కూటమి ప్రభుత్వం వచ్చాక హడావుడి చేసిన ప్రజాప్రతినిధులు
- నేటికీ పట్టించుకోని వైనం

శింగనమల: మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ పార్క్ పునఃప్రారంభం కలగానే మారిపోయింది. తమ ప్రభుత్వం రాగానే ప్రారంభిస్తామని చెప్పిన ప్రజాప్రతినిధులు మాట తప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే లెదర్క్ పార్క్‌ను ప్రజాప్రతినిధులు పరిశీలించారు. త్వరలో ప్రారంభిస్తామంటూ నిరుద్యోగుల్లో లేని ఆశలు కల్పించారు. ఉపాధి కల్పించి వలసలు నివారిస్తామంటూ డప్పు కొట్టుకున్నారు. ఇది జరిగి నేటికి ఏడాదిన్నరవుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఎలాంటి చర్యలూ కానరావడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓట్లు దండుకునేందుకే..

2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం శింగనమల మండలంలోని రాచేపల్లి వద్ద 52 ఎకరాల్లో లెదర్ పార్క్ ఏర్పాటు చేసింది. అప్పట్లో 15 మందికి చెన్నైలో శిక్షణ ఇచ్చారు. ఆ తరువాత 2003–2004 సమయంలో అనంతపురంలోని అంబేడ్కర్ భవనంలో కొంత మందికి శిక్షణ ఇచ్చారు. 2006–2008 మధ్యలో రాచేపల్లిలోని లెదర్ పార్క్ భవనంలోనూ శిక్షణ నిచ్చారు. లెదర్ చెప్పులు, లెదర్ బ్యాగులు, బెల్టులు తయారీలో తర్ఫీదునందించారు. అప్పట్లో శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలకు చెందిన వారు 1,500 మందికి దాకా ఉన్నారు. ఆ తర్వాత పలు కారణాలతో లెదర్ పార్కు మూతపడింది. ఈ క్రమంలోనే గత ఎన్నికల ముందు లెదర్ పార్క్‌ను ఎన్నికల అస్త్రంగా 'టీడీపీ' ఉపయోగించుకుంది. నిరుద్యోగుల ఓట్లు దండుకునేందుకు లేని ఆశలు కల్పించింది. కానీ నేటికీ లెదర్ పార్క్‌ను ప్రారంభించకపోవడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు.



రాచేపల్లి వద్ద మూతపడిన లెదర్ పార్క్

నిరాశే మిగిలింది



కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు లెదర్ పార్క్ పునః ప్రారంభిస్తామని చెప్పడంతో ఆశలు పెంచుకున్నా. లెదర్ పార్క్ ద్వారా స్థానికంగా ఉపాధి దొరుకుతుందని భావించా. గతంలో చెన్నై, అనంతపురంలో శిక్షణ పొందా. ఇప్పటివరకూ ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ చర్యలు తీసుకోకపోవడం నిరాశ కలిగిస్తోంది.

– ఓబిలేసు, తరిమెల గ్రామం, శింగనమల మండలం

హామీ నిలబెట్టుకోవాలి



లెదర్ పార్క్‌ను పునః ప్రారంభించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు మాట నిలబెట్టుకోవాలి. స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించి వలసలను అరికట్టాలి. ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే ఇక్కడికి ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి వెళ్లారు. ఆ తర్వాత ఇప్పటికీ ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం అన్యాయం.

– భాస్కర్, సీపీఎం జిల్లా కౌన్సిల్ మెంబర్, శింగనమల

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరగనుంది. జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరు కానున్నారు. సర్వసభ్య సమావేశానికి సంబంధించి జెడ్పీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత సమావేశాల్లో చర్చించిన విషయాలు, పరిష్కారం తదితర అంశాలపై సమాచారంతో అధికారులు హాజరు కానున్నారు.

పర్సెంటేజీ ఇవ్వలేదని పన్నాగం

- కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ ఉద్యోగి ఆగడాలు
- అడిగినంత ముట్టజెప్పలేదని 'జూనియర్'పై కక్షసాధింపులు
- ప్రజాప్రతినిధి అండ, పై అధికారి సహకారంతో రెచ్చిపోతున్న వైనం

అనంతపురం సిటీ: పర్సెంటేజీ ఇవ్వలేదని పన్నాగం పన్నారు. ప్రజాప్రతినిధి అండ చూసుకుని, పై అధికారి సహకారంతో రెచ్చిపోతున్నారు. కంబదూరు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేసే ఓ 'సీనియర్' ఉద్యోగి ఆగడాలు తారస్థాయికి చేరాయి. వివరాలు.. రూ.9 లక్షల పైచిలుకు ఉన్న అరియర్స్ బకాయిలు మంజూరు చేయాలంటే రూ.3 లక్షల పర్సంటేజీ ఇవ్వాలని సదరు 'సీనియర్' ఉద్యోగి ఇటీవల జూనియర్ ఉద్యోగిని డిమాండ్ చేశారు. తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, అంత మొత్తం ఇచ్చుకోలేనని 'జూనియర్' ఉద్యోగి మొరపెట్టుకున్నా కనికరించలేదు. దీంతో బాధిత 'జూనియర్' ఉద్యోగి జెడ్పీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీన్ని జీర్ణించుకోలేని 'సీనియర్' ఉద్యోగి తన పైస్థాయి అధికారిని కలుపుకొని 'జూనియర్'ను సరెండర్‌కు సిఫారసు చేస్తూ జెడ్పీ అధికారులకు లేఖ పంపడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉద్యోగి విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, అవినీతి అక్రమాలకు పాల్పడినా ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు తెలిపి, ఆ తరువాత వారి అనుమతితో సరెండర్ చేయాల్సి ఉన్నా, నిబంధనలు తోసిరాజని చేసిన ఈ అంశం సంచలనంగా మారింది. దీంతో జెడ్పీ అధికారులు కంబదూరు మండల పరిషత్ ముఖ్య అధికారి సహా 'సీనియర్' ఉద్యోగిని పిలిపించి 'అక్షింతలు' వేసినట్లు తెలిసింది.

ప్రజాప్రతినిధి ద్వారా..

ప్లాన్ బెడిసికొట్టడంతో 'సీనియర్' ఉద్యోగి కక్ష సాధింపులకు దిగారు. 'జూనియర్' ఉద్యోగి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో నియోజకవర్గ ప్రజాప్రతినిధి వద్ద ఈ విషయం చెప్పి జెడ్పీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అతను నియోజకవర్గంలో ఉద్యోగం చేయడానికి వీల్లేదని, ఇక్కడి నుంచి పంపేయాల్సిందేనని ప్రజాప్రతినిధి ఒత్తిడి తెచ్చినట్లు జెడ్పీ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో బాధితుడిని మరో ప్రాంతానికి డిప్యుటేషన్‌పై పంపేందుకే జెడ్పీ అధికారులు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

గతంలోనూ అక్రమాలు

గతంలో జెడ్పీలో పని చేసిన సమయంలో అక్రమంగా కోట్లాది రూపాయల బిల్లులు చేసి రూ.కోటి వరకు కొల్లగొట్టిన సీనియర్ ఉద్యోగి.. పనిష్మెంట్ కింద కంబదూరు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లినా వక్రబుద్ధి మార్చుకోలేదని తెలిసింది. దీంతో పాటు విధులకు నెలకు నాలుగైదు రోజులే వెళ్తున్నారని, ఎటువంటి బిల్లులు చేయాలన్నా కాంట్రాక్టర్లను అనంతపురంలోని నివాసానికి రప్పించుకుంటున్నట్లు సమాచారం.

సత్యసాయి మార్గంతో పరిపూర్ణత



నృత్య రూపకంలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: మనిషి అరిషడ్వర్గాలను వదిలి సత్యసాయి సనాతన ధర్మాలను పాటించడం ద్వారా మనిషి పరిపూర్ణుడు అవుతాడన్న సందేశాన్నిస్తూ సత్యసాయి యూత్, బాలవికాస్ విద్యార్థులు నిర్వహించిన సంగీత నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సంగారెడ్డి భక్తులు ఆదివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత స్వర నీరాజనం అర్పించారు. సాయంత్రం 'మృత్యోర్మా అమృతంగమయ' పేరుతో నిర్వహించిన సంగీత నృత్యరూపకం ఆకట్టుకుంది. మానవుడు ధర్మ మార్గాన్ని వదిలి అరిషడ్వర్గాలకు లోనై చెడు మార్గాల్లో పయనిస్తున్నాడని, సత్యసాయి సనాతన ధర్మాలను పాటించడం ద్వారా పరిపూర్ణుడవుతాడన్న సందేశామిచ్చారు.ఓ యువకుడి జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకుని నృత్యరూపకం ప్రదర్శించారు.

రైతు కష్టం.. దళారుల పాలు

రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ఆరుగాలం శ్రమించి టమాట పండించిన రైతులు ఓ వైపు అకాల వర్షం నుంచి పంటను కాపాడుకోవడానికి, మరో వైపు అధిక వర్షాల కారణంగా తెగుళ్ల బారి నుంచి పంట దిగుబడులు కాపాడుకునేందుకు నానా తంటాలు పడ్డారు. చివరకు దిగుబడిని మార్కెట్‌కు తరలిస్తే దళారుల ఇష్టారాజ్యంతో నిలువుదోపిడీకి గురవుతున్నారు.

- మార్కెట్‌లో పడిపోయిన టమాట ధరలు
- ప్యాపిలి మార్కెట్‌లో 25 కిలోల బాక్సు రూ.100 లోపే
- దిగుబడిని మార్కెట్‌లోనే వదిలేసి వచ్చిన టమాట రైతులు


టమాటను గ్రేడింగ్ చేస్తున్న రైతు

పెద్దపప్పూరు: టమాట మార్కెట్లలో దళారులు చెలరేగిపోవడంతో జిల్లాలో టమాట సాగు చేసిన రైతులు నష్టాలు చవిచూడక తప్పడం లేదు. చివరకు పొరుగు జిల్లాలోని మార్కెట్‌కు తరలించినా గిట్టుబాటు ధర లభ్యం కాక టమాటను ఎక్కడికక్కడ పడేస్తున్నారు. పంటకోత దశలో వరుసగా వర్షాలు కురవడంతో కాయలో నాణ్యత లోపించింది. చేతికందిన దిగుబడిలోనే రైతులు గ్రేడింగ్ చేసి నాణ్యమైన కాయలను మార్కెట్‌కు తరలిస్తున్నారు. అయినా ధర గిట్టుబాటు కాక తల్లడిల్లిపోతున్నారు.

వారం రోజుల్లోనే పడిపోయిన ధరలు..

తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దపప్పూరు, యాడికి, తాడిపత్రి మండలాల్లో దాదాపు 400 ఎకరాల్లో టమాటను రైతులు సాగు చేస్తున్నారు. వారం రోజుల క్రితం వరకూ నంద్యాల జిల్లా ప్యాపిలి మార్కెట్‌లో 25 కిలోల టమాట బాక్సు రూ.250 నుంచి రూ.400 వరకు ధర పలికింది. దీంతో కనీసం పెట్టుబడులైనా దక్కుతాయని భావించిన రైతులు ఎక్కువగా ప్యాపిలి మార్కెట్‌పై ఆధారపడ్డారు. తాజాగా శనివారం పెద్దపప్పూరు మండలంలోని గార్లదిన్నె, పసలూరు, కొట్టాలపల్లి తదితర గ్రామాల రైతులు తమ టమాట పంటను ప్యాపిలి మార్కెట్‌కు తరలించారు. అయితే గిట్టుబాటు ధర లభ్యం కాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు పంటను మార్కెట్‌లోనే పడేసి ఖాళీ బాక్సులతో ఇంటికి చేరుకున్నారు. మార్కెట్‌లో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

97 బాక్సుల టమాట పడేసా



రెండు ఎకరాల్లో సాగు చేసిన టమాట పంటను గ్రేడింగ్ చేసి 97 బాక్సుల్లో బొలెరో వాహనంలో ప్యాపిలి మార్కెట్‌కు శనివారం తీసుకెళ్లాను. రాత్రి పొద్దు పోయే వరకూ ఎదురు చూసినా 25 కిలోల బాక్సుకు కేవలం రూ.100కు మించి పాటడడం లేదు. కనీసం అదే ధరకైన పంటను అప్పగిద్దామనుకుంటే ఉన్నఫళంగా బాక్సు రూ.30తో అడిగారు. దీంతో ఓపిక నశించి 97 బాక్సుల పంటను మార్కెట్‌లోనే పడేసి వచ్చా.

– ప్రహ్లాదనాయుడు, రైతు, కొట్టాలపల్లి

కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కాదు



ప్యాపిలి మార్కెట్టులో దళారుల హవా నడుస్తోంది. గ్రేడింగ్ పేరుతో ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. 25 టమాట బాక్సులను మార్కెట్టుకు తీసుకెళితే.. 25 కిలోలు ఉన్న ఒక్కో బాక్సు రూ.30తో అడిగారు. ఆ ధరతో అమ్మితే కూలీల ఖర్చు కూడా గిట్టుబాటు కాదు. తిరిగి కమీషన్ చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో విసుగు చెంది మార్కెట్‌లోనే పంటను పడేసి, ఖాళీ బాక్సులతో వెనుతిరిగి వచ్చా. రవాణా ఖర్చుతో పాటు కూలీల ఖర్చులూ భరించాల్సి వచ్చింది. అప్పుల భారం పెరిగింది.

– రామాంజనేయులు, రైతు, కొట్టాలపల్లి

ప్రభుత్వానికి పట్టని ఉద్యోగుల సమస్యలు

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు


ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్ –1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు మండిపడ్డారు. ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని ఎన్‌జీఓ హోంలో సన్మానించారు. విశిష్ట అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు హాజరయ్యారు. డీఈఓ మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ప్రత్యేక చొరవతో జిల్లా విద్యా వికాసాభివృద్ధికి పని చేస్తున్నారని కొనియాడారు. హృదయరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలలు గడిచినా నేటికీ లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు, 4 విడతల డీఏలు, ఆర్థికేతర అంశాలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకపోతే భాగస్వామ్య సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్ నాయక్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, విశ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఫీ, జిల్లా గౌరవ అధ్యక్షుడు వరప్రసాద్, ఐఫియా కమిటీ సభ్యుడు సత్యప్రసాద్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, జిల్లా పూర్వ అధ్యక్షుడు రవీంద్ర, అసోసియేట్ అధ్యక్షుడు పోతులయ్య, అదనపు కార్యదర్శి ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఎంపిక


వరలక్ష్మి


రమాదేవి


నాగమణి

అనంతపురం అర్బన్: మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం 5వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. మహాసభలో 41 మందితో కూడిన రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా జి.వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దయా రమాదేవి, కోశాధికారిగా మద్దూరి నాగమణి (అనంతపురం) ఎన్నికయ్యారు. ఆఫీస్ బేరర్లుగా మహాలక్ష్మి (శ్రీకాకుళం), సుధారాణి (విజయనగరం), వై.శాంత (పార్వతీపురం), మంగశ్రీ (విశాఖపట్నం), వరలక్ష్మి (అనకాపల్లి), నాగవరలక్ష్మి (అంబేద్కర్ కోనసీమ), నాగమణి (ఏలూరు), సుప్రజ (ఎన్‌టీఆర్ జిల్లా), సమ్మక్క (కృష్ణా జిల్లా), శివకుమారి (పలనాడు), కల్పన (ప్రకాశం), ఎస్‌కేరెహాన్ (నెల్లూరు), కె.వి జయమ్మ (తిరుపతి)ని ఎన్నుకున్నారు. వీరితో పాటు 25 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'పార్ట్ టైం' పదాన్ని తొలగించాలి


మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ విజయ్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్షలో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ, మ్యూజిక్ టీచర్లు 14 సంవత్సరాలుగా పార్ట్‌టైం ఉద్యోగులుగా చాలీచాలని వేతనంతో పనిచేస్తున్నారని, వీరికి పార్ట్‌టైమ్ అనే పదాన్ని తొలగించి స్పష్టమైన జాబ్‌చార్ట్‌తో మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ కె.విజయ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పాట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న ఆగస్టు నెల వేతనం వెంటనే చెల్లించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలని, డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.దివాకర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య, సభ్యులు పి.చంద్రకళ, నరేంద్ర, మధుబాబు, చౌడప్ప, గీత, జంబునాథ్, రంగనాథ్, టి.నరసింహులు, కల్పన, గౌతమి, దీప, శ్రీదేవి, కళావతి, రాజేష్, రాంప్రసాద్, సుమలత పాల్గొన్నారు.

కమలపాడులో దొంగల బీభత్సం

- మాజీ ఎంపీపీ శైలజా రాజశేఖరరెడ్డి ఇంట్లో చోరీ
- ఐదు కిలోల వెండి, బంగారు ఆభరణాలు, నగదు, దస్త్రాల అపహరణ
- అదే గ్రామంలోని మరో ఇంట్లో నగదు, అర కిలో వెండి చోరీ
- గ్రామంలోని శివాలయంలో హుండీలోని కానుకలను ఎత్తుకెళ్లిన దుండగులు


మాజీ ఎంపీపీ ఇంట్లో వార్డురోబ్‌లో వస్తువులు చెల్లాచెదురు చేసిన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో దొంగలు బీభత్సం సృష్టించారు. మాజీ ఎంపీపీ శైలజారాజశేఖరరెడ్డి ఇంటికి తాళం వేసిన గుర్తించిన దుండగులు ఆదివారం వేకువజామున లోపలకు చొరబడ్డారు. బీరువాతో పాటు వార్డు రోబ్‌ను తెరిచి అందులోని కీలకమైన డాక్యుమెంట్లు, రూ.10 వేల నగదు, ఐదు కిలోల వెండి, రెండు జతల బంగారు కమ్మలు అపహరించారు. అనంతరం అర్చకుడు దేవేంద్రస్వామి ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.1.5 లక్షల నగదు, అర కిలో వెండి సామగ్రిని అపహరించారు. గ్రామంలోని శివాలయం ఆవరణలో ఉన్న హుండీ తాళాలను బద్ధలుగొట్టి అందులోని సుమారు రూ.15 వేలను అపహరించారు. ఉదయం అనంతపురం నుంచి ఇంటికి చేరుకున్న శైలజారాజశేఖరరెడ్డి, అలాగే గుంతకల్లు ఉంచి కమలపాడుకు చేరుకున్న అర్చకుడు దేవేంద్రస్వామి చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ నాగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంను రంగంలో దించి నిందితుల వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రణభేరి జాతాను జయప్రదం చేయండి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా


మాట్లాడుతున్న లక్ష్మీరాజా

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించిన విద్యారంగ, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లాలో ప్రవేశించనున్న రణభేరి జాతాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర పాలక ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ, ఐఆర్ ప్రకటిస్తామని నమ్మబలికి లబ్ధి పొందిన తరువాత వారి న్యాయమైన సమస్యలను కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలులో ప్రారంభమయ్యే పశ్చిమ రాయలసీమ రణభేరి ప్రచార జాతా 16న గుంతకల్లులో ప్రవేశిస్తుందన్నారు. అక్కడి నుంచి ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా ప్రయాణిస్తూ మార్గమధ్యంన ఉపాధ్యాయులతో కలిసి చర్చించి సమస్యలను సేకరిస్తూ అనంతపురం చేరుకుంటుందన్నారు. జాతా వాహనంతో పాటు ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, జిల్లా సహాధ్యక్షులు రామప్ప, సహాధ్యక్షురాలు సరళ, కోశాధికారి రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఎవరో చేస్తారని ఎదురు చూడకుండా..


ముచ్చుకోట దాటిన తర్వాత దెబ్బతిన్న రోడ్డును బాగు చేస్తున్న రమేష్, చరణ్

పెద్దపప్పూరు/శెట్టూరు: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమకున్న వనరులతోనే రోడ్డు మరమ్మతులకు యువత పూనుకుంది. వారి సంకల్పాన్ని గమనించిన పలువురు అభినందనలతో ముంచెత్తారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట – కొండాపురం మార్గంలో ఓ చోట దెబ్బతిన్న జాతీయ రహదారిపై వాహనదారులు ఇబ్బంది పడకుండా మరమ్మతులకు ముచ్చుకోటకు చెందిన రమేష్, చరణ్ శ్రీకారం చుట్టారు. ఆదివారం దాదాపు రెండు గంటల పాటు శ్రమించి రోడ్డును బాగు చేశారు. ఈ విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శభాష్ రమేష్, చరణ్ అంటూ నెటిజన్లు అభినందించారు. అలాగే శెట్టూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే ప్రధాన రోడ్డుపై భారీగా గుంతలు పడడంతో 'హెల్పింగ్ హ్యాండ్స్' సభ్యులు నవీన్, మహేష్, బాలరాజ్, సురేష్, సత్యనారాయణ, రఘు, వీరేష్, సుభేష్‌బాబు ఆదివారం పూడ్చివేశారు. సిమెంటు, కంకర కలిపి పూడ్చివేయడంతో వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. దీంతో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను పలువురు అభినందించారు.


శెట్టూరు సమీపంలో గుంతలు పూడ్చి వేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

వివాహిత బలవన్మరణం


శిరీష మృతదేహం

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న డీజిల్‌షెడ్ మెకానిక్ హరి భార్య శిరీష(32) ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ఉదయం ఏడు గంటల సమయంలో భార్య ఇచ్చిన టీ తాగిన అనంతరం హరి డ్యూటీకి వెళ్లిపోయాడు. అనంతరంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న శిరీష ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించి చుట్టుపక్కల వారి సమాచారంతో హరి ఇంటికి చేరుకుని శిరీషను వెంటనే రైల్వే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

తోపుదుర్తి భాస్కరరెడ్డికి కన్నీటి వీడ్కోలు


తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న అనంత వెంకట్రామిరెడ్డి, ఉష శ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు


హాజరైన మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ, చవ్వా రాజశేఖరరెడ్డి తదితరులు

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కరరెడ్డి (70) అంత్యక్రియలు ఆదివారం అశ్రునయనాల మధ్య జరిగాయి. శుక్రవారం గుండెపోటుతో ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలు ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలోని సొంత వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. అనంతపురంలోని తోపుదుర్తి భాస్కరరెడ్డి నివాసం నుంచి పెద్ద ఎత్తున అంతిమయాత్ర సాగింది. భాస్కర్‌రెడ్డి అంతిమయాత్ర విషయం తెలుసుకున్న ప్రజలు కక్కలపల్లి కాలనీ నుంచి ఆలమూరు రోడ్డు, బి. యాలేరు, మదిగుబ్బ క్రాస్, సనప, రంగంపేట, తోపుదుర్తి గ్రామాల వరకూ ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో తరలివచ్చారు. దారి వెంట ట్రాక్టర్లు పెట్టి పూలు చల్లుతూ ఆయనకు నివాళులర్పించారు. భాస్కరరెడ్డి సతీమణి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తోపుదుర్తి కవితను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

తోపుదుర్తి భాస్కరరెడ్డి అంత్య క్రియల్లో వైఎస్సార్‌సీపీ ఉభయ జిల్లాల అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, ఉష శ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, ఆలూరు సాంబశివారెడ్డి, చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు చవ్వా రాజశేఖరరెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి నయనతారెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్ రెడ్డి, వాసుదేవరెడ్డి, నరసింహారెడ్డి, పార్టీ ఆత్మకూరు మండల కన్వీనర్ బాలపోతన్న, బీసీ రమేష్ గౌడ్, చింతా సోమశేఖర్‌రెడ్డి, ఆలుమూరు సుబ్బారెడ్డి, రంగంపేట గోపాల్ రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, వీరాంజనేయులు, తలమర్ల సంజీవరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఇస్మాయిల్, నగేష్‌రెడ్డి, హరీష్‌యాదవ్, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పుత్త ప్రతాప్ రెడ్డి, మల్లన్న, కృష్ణానాయక్ , మాజీ ఎంపీటీసీ చిన్నా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

గుంతకల్లు: కొనకొండ్ల సమీపంలోని భారతీ పబ్లిక్ స్కూల్‌లో ఈ నెల 16న జిల్లా స్థాయి బాలబాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేయనున్నాకు. ఈ మేరకు కబడ్డీ అసోసియేషన్ సభ్యుడు రాఘవేంద్ర ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22, 23, 24, 25వ తేదీల్లో విజయవాడలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు 94410 53041,99662 24669లో సంప్రదించవచ్చు.

25 నుంచి ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీ

గుత్తి: స్థానిక ఆర్‌ఎస్‌లోని రైల్వే ఇనిస్టిట్యూట్ క్రీడామైదానంలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకూ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి గుత్తి రైల్వే ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వాహకులు సమావేశమై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గౌతమపురి ఫుట్‌బాల్ అసోసియేషన్, ఆర్డీటీ, రైల్వే ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా ప్రేమ్ అండ్ సూరి మెమోరియల్ ఇన్విటేషన్ ఫుట్‌బాల్ టోర్నీని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల జట్లను ఆహ్వానించనున్నట్లు పేర్కొన్నారు. విజేత జట్లను నగదు పురస్కారాలతో సత్కరించనున్నామన్నారు. టోర్నీలో పాల్గొన దలచిన జట్లు ఈ నెల 18లోపు పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 90526 53405, 99856 78208, 99665 60163లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఏఎన్‌ఆర్ జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం కల్చరల్: స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. అనంత అక్కినేని అభిమాన సంఘాలు, క్లాస్ ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి డీఆర్వో మలోల, ఆర్డీవో కేశవనాయక్, మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ రంగస్వామి, సామాజిక సేవా కార్యకర్త కొప్పుల రమణ, ఘంటసాల ఆరాధన సమితి జీవీరామయ్య హాజరయ్యారు. గాయనీగాయకులు పాలసముద్రం నాగరాజు, రామాంజి, శ్రీదేవి, బృంద, విజయలక్ష్మి, ఆచార్య సుధాకరబాబు తదితరులు అక్కినేని మధుర గీతాలతో శ్రోతలను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో అభిమాన సంఘాల నిర్వాహకులు మురుగన్, భరత్, గాంగే నాయక్, రియాజుద్దీన్, సుధాకరమూర్తి పాల్గొన్నారు.

ఇమ్రాన్ చిస్తీ ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనకు వచ్చిన ఇమ్రాన్ చిస్తీ

అనంతపురం కల్చరల్: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అజ్మీర్ దర్గా స్వామి ఇమ్రాన్ చిస్తీ ఆదివారం అనంత పర్యటనకు విచ్చేశారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి వేముల అబూజర్ నదీమ్ అహమ్మద్ స్వగృహానికి ఆదివారం ఇమ్రాన్ చిస్తీ విచ్చేశారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ బలోపేతానికి, రాబోవు ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడానికి ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, వసీం అక్రమ్, సాద్ అహమద్, ఉమర్ ఫారూఖ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల పోస్టర్ల విడుదల

అనంతపురం కల్చరల్: వాసవీమాత ఆలయంలో ఈసారి మరింత వైభవంగా దసరా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు తెలిపారు. ఆదివారం స్థానిక కొత్తూరు అమ్మవారిశాలలో సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు జరిగే ఫ్లెక్సీలు విడుదల చేశారు.

బాధితులపైనే కేసులా?



గాయపడిన గోసల ఎర్రమ్మ

ఆత్మకూరు: 'కూటమి ప్రభుత్వంలో రోజు రోజుకు దాడులు పెరిగిపోతున్నాయి. దీనికి తోడు బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు'. అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. ఆత్మకూరు మండలంలోని తలుపూరుకు చెందిన దంపతులు గోసల కొండన్న, గోసల ఎర్రమ్మపై టీడీపీ నేతలు శనివారం సాయంత్రం దాడి చేయడంతో ఎర్రమ్మకు 16 కుట్లు పడ్డాయి. కొండన్న కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా.. ఎర్రమ్మ ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసులు నమోదు చేశారు. అయితే గాయపడిన వైఎస్సార్‌సీపీకి చెందిన 10 మందిపై కేసులు ఎలా నమోదు చేయడంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళ ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలో ఇలా టీడీపీ నేతలు బరితెగించి మహిళల తలలు ఎలా పగలకొడుతారని ఎంపీపీ హేమలత మండిపడ్డారు. అధికారం ఉందని, దాడులకు తెగపడటం హేయమని వైస్ ఎంపీపీ విజయకుమార్‌నాయక్ అన్నారు. పొలంలో పనిచేస్తుండగా తనతో పాటు తన భార్య ఎర్రమ్మ, మరో వ్యక్తిపై కర్రలతో దాడి చేశారని బాధితుడు కొండన్న చెబుతున్నారు. దాడి చేయడంతో పాటు తమపైనే మళ్లీ కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. గొడవ జరిగిన ప్రదేశంలో ముగ్గురం ఉంటే పది మందిపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. కేవలం టీడీపీ నేతల ప్రోద్బలంతోనే కేసులు నమోదు చేశారన్నారు. ఘటనపై ఎస్‌ఐ లక్ష్మణరావును వివరణ కోరగా దాడి చేసుకున్న ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎర్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13 మందిపై, ప్రభావతి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు.

సందడిగా అపూర్వ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని నేతాజీ సుభాస్ చంద్రబోస్ స్కూల్‌లో 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సందడిగా సాగింది. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులతో సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ పూర్వ విద్యార్థుల కలయికకు మల్లె చిన్నరామప్ప, పయ్యావుల రామాంజనేయులు, రేపటి రామాంజనేయులు, ఖాజా మొహిద్దీన్, శివప్రసాద్, బసవరాజు, చిరంజీవి నాయకత్వం వహించారు.

27 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక



రాప్తాడు: మండలంలోని జెడ్పీహెచ్ఎస్ లో 1998–1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని ఎంతో సంతోషంగా గడిపారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రెండు బీరువాలు, నాలుగు టెబుల్స్, 50 కుర్చీలు, 70 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్‌ను హెచ్ఎం రామచంద్రారెడ్డికి అందజేశారు.

మిట్టా ఆంజనేయులు సేవలు చిరస్మరణీయం

అనంతపురం కల్చరల్: సంస్కృత పండితుడు మిట్టా ఆంజనేయులు జీవితం ఆదర్శప్రాయమని వక్తలు అన్నారు. ఇటీవల మరణించిన ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మిట్టా ఆంజనేయులు సంతాప సభ ఆదివారం కొత్తూరు అమ్మవారి శాలలో జరిగింది. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు మచ్చా నరసింహులు, ఆర్యవైశ్య,యువజన, మహిళా మండలి నాయకులు పాల్గొన్నారు.

17న నిరుద్యోగి ఆవేదన సదస్సు

అనంతపురం అర్బన్: యువతకు ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలుకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 17న విజయవాడలో 'నిరుద్యోగి ఆవేదన సదస్సు' నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో సదస్సు పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. నాయకులు దేవేంద్ర, వంశీకృష్ణ, ధనుంజయ, శ్రీనివాసులు, నాయక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

వద్దుపల్లి టోల్‌గేట్ వద్ద వాగ్వాదం

ఆత్మకూరు: వద్దుపల్లి టోల్ గేట్ వద్ద వాగ్వాదం జరిగింది. ఆదివారం ఆత్మకూరుకు చెందిన ఓ వాహనం టోల్‌గేట్‌వద్దకు రాగా, ముందు మరో వాహనం ఉంది. ఆకారు ఫాస్టాగ్‌లో నగదు లేక ముందుకు వెళ్లలేదు. దీంతో వెనుక ఉన్న వాహన డ్రైవర్ అక్కడున్న సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. మాటా మాటా పెరిగి, బూతులు తిట్టుకున్నారు. ఇదంతా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని రౌడీషీటరర్లు, నేర చరిత్ర ఉన్న వారికి పోలీసులు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

మంచి నాయకుడిని కోల్పోయాం



భాస్కర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న గోరంట్ల మాధవ్

అనంతపురం ఎడ్యుకేషన్: తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక మృతితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధత, నిజాయతీ గల నాయకుడిని కోల్పోయిందని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ అన్నారు. ఆదివారం రామచంద్రనగర్‌లో తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భాస్కర్‌రెడ్డి అందరితో కలుపుగోలుగా ఉండేవాడని అన్నారు.

నూతన కమిటీకి సన్మానం

అనంతపురం కల్చరల్: కాశీవిశ్వేశ్వరాలయం నూతన కమిటీ సభ్యులను జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు అభినందించారు. ఆదివారం చైర్మన్‌గా ఎంపికైన నరేంద్ర చౌదరిని కలిసి జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సీవీ మురళీధర్, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, సంఘం ప్రతినిధులు శేషశయన, నారాయణరావు, నాగభూషణరావు తదితరులు సన్మానించారు.

ఇంజినీరింగ్ మేధావి మోక్షగుండం

- నేడు విశ్వేశ్వరయ్య జయంతి



జేఎన్‌టీయూ కళాశాల

అనంతపురం /అనంతపురం కల్చరల్: దేశ సమగ్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఇంజినీర్లకు మార్గదర్శిగా, భారతజాతి కీర్తి ప్రతిష్టలు సుసంపన్నం చేసిన మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోయాయి. ఏటా సెప్టెంబర్ 15న మోక్షగుండం జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డేను జరుపుకుంటారు.

కరువు సీమలో సాంకేతిక కల్పతరువు..

మోక్షగుండం స్ఫూర్తితో ఆయన అందించిన ప్రేరణతో దేశమంతటా అపురూప కట్టడాలు రూపుదిద్దుకున్నాయి. అనంతలోనూ నాటి ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పట్టే కట్టడాలు ఎన్నో ఉన్నాయి. ఆర్ట్స్ కాలేజీ, జిల్లా కోర్టు ప్రాంగణం, రెవెన్యూ భవనాలు చెక్కుచెదరని, అద్భుత కట్టడాలుగా నిలిచాయి. అందులో అనంత కరువు సీమలో సాంకేతిక కల్పతరువుగా భాసిల్లుతున్న జేఎన్‌టీయూఏ 1949లో ప్రారంభమైంది. 2008లో వర్సిటీగా ఆవిర్భవించింది. ఏటా 90 వేల మందికి పైగా విద్యార్థులు జేఎన్‌టీయూ పరిధిలో చదువుకుంటూ భావి ఇంజినీర్లుగా వస్తున్నారు. వైఎస్సార్ సీఎం కాకముందు నూటికొకరు ఇంజినీర్లు ఉండేవారు. ఇంజినీర్ కావాలన్న ప్రతి ఒక్కరి కల సాకారం చేసిన ఘనత వైఎస్సార్‌దే. ఆయన హయాంలో ఇంజినీరింగ్ కళాశాలలను విరివిగా పెంచారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించి ఎందరినో ఉన్నత విద్యావంతులను చేశారు. ప్రతిభావంతులైన అనంతపురం ఇంజినీర్లు వినూత్న ఆవిష్కరణలతో రాష్ట్రంలోనే తలమానికంగా నిలిచారు. ప్రస్తుత రోజుల్లో కేవలం ఇంజినీరింగ్ మాత్రమే ప్రధాన ఉపాధిగా మారడం వెనుక ఆయన కృషి అపారం.

అభాగ్యురాలికి 'అమ్మ' ఆసరా



ఆర్థిక సాయం అందిస్తున్న 'అమ్మ' రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని నాయక్ నగర్‌కు చెందిన చాకలి సావిత్రమ్మ మెరుగైన చికిత్స కోసం 'అమ్మ' సంస్థ తరిమెల రమణా రెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందించారు. సావిత్రమ్మకు గుండెనొప్పి రావడంతో బైపాస్ సర్జరీకి, మందులకు రూ.3 లక్షలకుపైగా ఖర్చవుతుందని తెలియడంతో అమ్మ సంస్థ రమణారెడ్డిని సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి సర్జరీ కోసం రూ.లక్ష , మరో రూ.20 వేలు హైదరాబాద్‌కు వెళ్లడానికి ఆర్థిక సాయం అందించారు.

పూర్వ విద్యార్థికి సన్మానం



రమణను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ హోటల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఎస్ఎస్ ఫ్యామిలీ రెస్టారెంట్ కె.రమణను పూర్వ విద్యార్థులు సన్మానించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో 1984–85లో రమణ పదో తరగతి చదివాడు. పూర్వ విద్యార్థులు పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు.

వైభవంగా కోటి కుంకుమార్చన

అనంతపురం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణమంటపంలో మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం ఆధ్వర్యంలో లలిత పరమేశ్వరిదేవి కోటి కుంకుమార్చన ఆదివారం నిర్వహించారు. ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధి ప్రమోద్‌కుమార్ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి డీఆర్‌ఓ మలోల, విశ్వశాంతి ఆశ్రమం జిల్లా ప్రతినిధులు శ్యామలమ్మ, సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ మాట్లాడారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సువర్ణ, కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయ ప్రతినిధులు విజయ్‌కుమార్, టీటీడీ సుధాకరరెడ్డి, లహరిరాజ్, అవోపా జయంతి శ్రీనివాసుశెట్టి, సాయి, కట్ట పరమేష్ పాల్గొన్నారు.